

శాస్త్రీయంగా దర్యాప్తు చేయాలి

● పోలీస్ డ్యూటీ మీట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయంగా నేరాల దర్యాప్తు చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా సూచించారు. బుధవారం కమిషనరేట్‌లో కాళేశ్వరం జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించారు. పెద్దపల్లి, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లా పరిధిలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో నేర విచారణకు ఎదురయ్యే అంశాలకు సంబంధించి మెళకువలు నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. సైంటిఫిక్, ఫింగర్ ప్రింట్ ఇన్వెస్టిగేషన్‌లో సాంకేతిక పరిజ్ఞానం, కేసుల దర్యాప్తులో మెళకువలు నేర్చుకునే వీలు కలుగుతుందన్నారు. పోలీసులు తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి సంక్లిష్టమైన కేసుల పరిష్కారంలో తమ ఆలోచనలు మార్పిడి చేసుకోవడానికి డ్యూటీ మీట్‌లు వేదిక అవుతాయన్నారు. డ్యూటీ మీట్‌లో ఎంపికైన వారు కాళేశ్వరం జోన్ తరఫున వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌లో పాల్గొంటారన్నారు.

నాలుగు అంశాల్లో పోటీలు...

కాళేశ్వరం స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో నాలుగు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. సైంటిఫిక్ అయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ ఈవెంట్‌లో ఫొరెన్సిక్ సైన్స్, క్రిమినల్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా, రాతపరీక్ష, మెడికో లీగల్, క్రైమ్ సీన్ ఫొటోగ్రఫీలో రాత, ప్రాక్టికల్ టెస్టులు ఉంటాయి. అలాగే యాంటీ సబొటేజ్ చెక్ ఈవెంట్‌లో వెహికల్ సర్చ్, గ్రౌండ్ సర్చ్, రూమ్ సర్చ్, యాక్సిక్ కంట్రోల్, కంప్యూటర్ అవర్నెస్ కాంపిటీషన్ ఈవెంట్‌లో కంప్యూటర్ అవర్నెస్ ఆఫీస్ ఆటోమేషన్, ప్రొగ్రామింగ్ ఎబిలిటీ, డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్‌లో ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్, నార్కోటిక్ సర్చ్ కాంపిటీషన్లు ఉంటాయి. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, ఎస్బీ ఏసీపీమల్లారెడ్డి, గోదావరిఖని ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బాబు రావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఐటీకోర్ ఇన్‌స్పెక్టర్ సతీష్, కాళేశ్వరం జోన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ జాగిలాన్ని పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

చెరువు మట్టి తరలింపుతో రూ. 2.47 కోట్ల ఆదాయం

పెద్దపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చెరువుల నుంచి 9,185 టిప్పర్ల మట్టిని తరలించగా 2కోట్ల 47 లక్షల 99వేల 500 రూపాయల ఆదాయం సమకూరిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు, ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. పెద్దపల్లి మండలంలోని చేతికుంట చెరువు, కల్వా చెరువు ద్వారా 330లారీ టిప్పర్ ట్రిప్పులు, సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ షాంగై కుంట ద్వారా 71 ట్రిప్పులు, కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్ళ చెరువు ద్వారా 1575 ట్రిప్పులు, ఓదెల మండలం కొలనూరులోని అప్పమయ చెరువు ద్వారా 2125ట్రిప్పులు, అలిమయ చెరువు ద్వారా 3713 ట్రిప్పులు, ఇందుర్తిలోని ఊర చెరువు ద్వారా 1191 ట్రిప్పులు, మంథని మండలం సూరాయిపల్లి గ్రామంలోని రెడ్డి చెరువు ద్వారా 180 లారీ టిప్పర్ ట్రిప్పులు మట్టిని తరలించాయని పేర్కొన్నారు. మట్టి తరలింపు ద్వారా వచ్చిన 2కోట్ల 44లక్షల రూపాయలతో మంథని, ఓదెల, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, సుల్తానా బాద్ మండలంలో అంతర్గత సీసీ రోడ్లు, ప్రభుత్వ పాఠశాల మరమ్మతు పనులకు, కేజీబీవీలో అదనపు సౌకర్యాల కల్పనకు వినియోగించామని కలెక్టర్ పేర్కొన్నారు.



పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామంలో స్లాబ్ దశకు చేరుకున్న ఇందిరమ్మ ఇల్లు

'ఇందిరమ్మ' నిర్మాణాల్లో పుంజుకున్న వేగం

- పైలట్ గ్రామాల్లో కొనసాగుతున్న నిర్మాణాలు
- ఇతర గ్రామాల్లో ముగ్గులు పోస్తున్న ప్రజాప్రతినిధులు
- మొదటి విడతలో 9,421 ఇళ్లకు 5,920 ఇళ్లు మంజూరు
- మెటీరియల్ ధరలు తగ్గించేందుకు మండలాల్లో కమిటీలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పుంజుకున్నది. నాలుగు మాసాల క్రితం ప్రయోగాత్మకంగా ఒక్కో గ్రామానికి మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు వేగం పెంచేలా అధికార యంత్రాంగం చొరవ చూపుతోంది. బేస్‌మెంట్ స్థాయి నుంచి స్లాబ్ లెవెల్ వరకు కొన్ని ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

జిల్లాకు మొదటి విడతలో 9,421 ఇళ్లు కేటాయించగా, 5,920 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. ఇంకా 3,501 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాల్సి ఉంది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుక వస్తామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి ఉచితంగా 5 లక్షల రూపాయలు అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించింది. ఈ ఇళ్లను సొంత ఇంటి స్థలం ఉన్న వారికే మంజూరు చేయాలని పేర్కొంది. ఎన్నికలు జరిగిన తర్వాత నిర్వహించిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలో 1,76,874 దరఖాస్తులు వచ్చాయి. ఈ పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ యాప్ ద్వారా గతేడాది అక్టోబర్, నవంబర్ మాసాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో, మున్సిపల్ సిబ్బంది మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం దర ఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి సర్వే చేశారు. ఫొటో లు

(మిగతా 8వ పేజీలో)

● 5,920 మంది లబ్ధిదారులకు మంజూరు

జిల్లాకు మొదటి విడతలో 9,421 ఇళ్లు కేటాయించారు. పెద్దపల్లి నియోజకవర్గానికి 3,500 ఇళ్లకుగాను 3,001 మందికి, రామగుండం నియోజకవర్గానికి 3,500 ఇళ్లకు 1,500 ఇళ్లు, మంథని నియోజకవర్గంలోని జిల్లా లో గల నాలుగు మండలాలకు 1,750 ఇళ్లు కేటాయించగా 850 ఇళ్లు, ధర్మపురి నియోజకవర్గం పరిధిలోని ధర్మారం మండలానికి 671 ఇళ్లు కేటాయించగా 569 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఇళ్లకు ముగ్గులు పోస్తున్నారు. మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, అక్కడ పూర్తి స్థాయిలో ఎల్ 1 కేటగిరీలో 1940 ఇళ్లు మంజూరు చేయగా, 775 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, మిగతా ఇళ్ల నిర్మాణాలు కూడా సాగుతున్నాయి.

సీజనల్ వ్యాధుల నివారణకు అప్రమత్తంగా ఉండాలి



ఓదెలలో మురికి కాలువలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న

ఓదెల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజనల్ వ్యాధులను నివారించేందుకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య శాఖ అధికారి అన్నప్రసన్న కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో సందర్శించారు. ఆసుపత్రికి వస్తున్న రోగులు, అందుబాటులో సిబ్బంది ఉంటున్నారా అనే విషయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇండ్లల్లో నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉన్నట్లయితే ఉపయోగించిన వాహనాల ఆయిల్, డీజిల్‌లో చిన్న, చిన్న దుస్తులు తడిపి నీటిలో వేయాలని తెలిపారు. దీని ద్వారా నీటిలో ఉన్న దోమల లార్వా నశిస్తాయని తెలిపారు. రోడ్ల వెంట ఉపయోగం లేని మొక్కలను, చెత్తను తీసివేయాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. గర్భిణులు అత్యవసర సమయంలో 108, 102 వాహనాలను ఉపయోగించుకోవాలని, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రి కంటే ఎక్కువ సౌకర్యాలు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

జ్యోతినగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం కాజీపల్లిలోని ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. పార్టీ పరిశీలకులు సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, సంగీతం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళారీ వ్యవస్థ లేకుండా ప్రతీ లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామని, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను చేస్తున్నామన్నారు. రైతు భరోసా కింద రైతులకు 2 లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని తెలిపారు. కటింగ్ లేకుండా తడిసిన, రంగు మారిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నదని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తున్నప్పటికీ బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అదుబాటులో ఉండి ప్రభుత్వం చేస్తున్న పనులను వివరించాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలే గెలిపిస్తాయని, ప్రజలను ధైర్యంగా ఓటు అడుగుతామన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ఎంతో కష్టపడ్డారని, రాబోయే స్థానిక ఎన్నికలలో పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసే నాయకుల విజయానికి తాను కష్ట పడుతానని మక్కాన్‌సింగ్ స్పష్టం చేశారు. నియోజకవర్గం పరిశీలకులు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. సవవేశంలో నాయకులు బొంత రాజేశ్, కాల్వ లింగస్వామి, రవికుమార్, మహంకాళి స్వామి, కొలిపాక సుజాత, పెద్దెల్లి ప్రకాష్, తేజశ్విని, కొలని కవితారెడ్డి, తానిపర్తి గోపాల్‌రావు, ఎండీ.ఆసీఫ్, ఎం.డి.రహీం, పెండ్యాల మహేశ్, గట్ల రమేష్, ముస్తఫా, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జిల్లాలో 14.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

పెద్దపల్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 14.8 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ధర్మారంలో 21.8 మిల్లీ మీటర్ల వర్షం కురియగా, అత్యల్పంగా రామగుండంలో 10.7 మిల్లీమీటర్లు కురిసింది. మంథని మండలంలో 18.8 మిల్లీ మీటర్లు, పాలకుర్తి 16.8, జూలపల్లి 16.6, ఎలిగేడు 16.3, సుల్తానాబాద్ 14.5, పెద్దపల్లి 14.0, ముత్తారం 13.9, కమాన్‌పూర్ 13.5, రామగిరి 13.3, అంతర్గాం 12.7, కాల్వశ్రీరాంపూర్ 12.3, ఓదెల 11.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 169.3 మిల్లీ మీటర్లు కాగా, 110.6 మిల్లీ మీటర్లుగా నమోదయ్యింది. సాధారణానికంటే 35 శాతం లోటు వర్ష పాతం ఉంది.

రామగుండంలో ట్రేడ్ లైసెన్స్‌ల ఆదాయంపై దృష్టి

● క్షేత్ర స్థాయిలో లెక్కలు తీస్తున్న వార్డు ఆఫీసర్లు

● కొత్తగా 746వ్యాపారాల గుర్తింపు ● మొదటి త్రైమాసికంలో 50శాతం వసూలు

కోల్‌సిటీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ట్రేడ్‌లైసెన్స్ ద్వారా ఆదాయం పెంపుపై దృష్టి పెట్టింది. క్షేత్ర స్థాయిలో వార్డు ఆఫీసర్లతో సర్వే చేయిస్తుంది. కార్పొరేషన్ పరిధిలోని ట్రేడ్ లైసెన్స్‌ల ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉండడంతో దానిపై దృష్టి సారించింది. అదనపు కలెక్టర్, కమిషనర్ అరుణశ్రీ వార్డు ఆఫీసర్లతో సమీక్షలు నిర్వహించి ప్రతి వ్యాపార సంస్థను ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి తీసుకురావాలని సూచిస్తున్నారు. ఇందు కోసం వార్డు ఆఫీసర్లకు ప్రత్యేకంగా ట్యాబ్‌లు ఇస్తున్నారు. వార్డు ఆఫీసర్లకు బాధ్యతలు ఇవ్వడంతో వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ట్రేడ్ లైసెన్స్‌ల లెక్కలు తీస్తున్నారు. గతంలో 3,036 ట్రేడ్ అసెస్‌మెంట్లు ఉండగా క్షేత్రస్థాయి పరిశీలనతో ఇప్పటి వరకు 3782 వ్యాపారాలను గుర్తించారు. అదనంగా 746అసెస్‌మెంట్లు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో డిమాండ్‌లో 72.16శాతం వసూలు కాగా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే 50శాతంపైగా వసూలు అయినట్లు కమిషనర్ అరుణశ్రీ తెలిపారు. నెల రోజుల్లోనే వ్యాపారుల నుంచి మంచి స్పందన లభించిందని, 746కొత్త ట్రేడ్ లైసెన్స్ అసెస్‌మెంట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. పాత లైసెన్స్‌లను కూడా సకాలంలో రెన్యువల్ చేయిస్తామని ఆమె తెలిపారు.



షాపుల కొలతలు తీస్తున్న కార్పొరేషన్ అధికారులు

బోనాలు ప్రజల ఐక్యతను చాటుతాయి



అమ్మవారిని దర్శించుకొంటున్న ఎంపీ వంశీకృష్ణ

రామగిరి, జూలై 2(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో బోనాల వంటి పండుగలు ప్రజల ఐక్యతకు, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతి రూపంగా నిలుస్తాయని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పిలో నిర్వహించిన బోనాల ఉత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మైన్స్‌లలో కార్మికుల భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్మికులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఎలిగేడు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకొంటున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం జడ్పీ ఉన్నత పాఠశాల, సుల్తాన్‌పూర్‌లో పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. సుల్తాన్‌పూర్‌లో మాజీ సర్పంచ్, స్వాతంత్ర్య సమరయోధుడు తానిపర్తి కాంతారావు జ్ఞాపకార్థం వారి కుమారులు పాఠశాలకు రూ.5 లక్షల విలువ గల ఎలక్ట్రిక్ ఆటోను అందించారు. 1977-78 బ్యాచ్ 7వ తరగతి విద్యార్థులు రూ.2.16 లక్షల విలువగల డైనింగ్ టేబుల్ సెట్‌ను అందజేశారు. అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా రూ.9 లక్షలు నిధులు వెచ్చించి శిథిలావస్థలో ఉన్న డైనింగ్ హాల్ మరమ్మతు, రూ.5 లక్షలతో అంతర్గత రోడ్లు, గేటు ఏర్పాటు పనులను పరిశీలించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సైకిళ్లు అందించేందుకు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. పాఠశాలకు దాతలు కిచెన్ షెడ్డుకు అవసరమైన 9 డైనింగ్ టేబుళ్లు, 18 బెంచీలను కలెక్టర్ పంపిణీ చేశారు. విద్యాలయాల్లో సరైన బోధన అందించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంఈవో, హెచ్‌ఎంలు అనసూరి నరేంద్రచారి, గంగ్ర దేవేందర్ రావు, సంతోష్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, తిరుపతి, సీఆర్పీ లక్ష్మినారాయణ, అధికారులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సింగరేణి క్వార్టర్లు

- రంగులు వేయకపోవడంతో వెలసిన క్వార్టర్లు
- పెచ్చులూడుతున్న స్లాబ్
- ఊడిపోయిన వైరింగ్, అధ్వానంగా డ్రైనేజీ
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- సెంటినరీ కాలనీలో సమస్యల తిష్ట



రంగులు వెలిసిన క్వార్టర్లు

రామగిరి, జూలై 2(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణి ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పడిన సెంచరీ కాలనీ క్రమంగా సెంటినరీకాలనీగా మారింది. ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సింగరేణికి మానస పుత్రికగా నిలిచింది. మూడు దశాబ్దాల క్రితం పురుడు పోసుకున్న సెంటినరీకాలనీ ప్రస్తుతం అంతర్గత సమస్యలతో కొట్టుమిట్టాడు తుంది. తాగు నీరు, డ్రైనేజీ వ్యవస్థ, క్వార్టర్స్‌లలో రూఫ్ లీకేజీలు, వైరింగ్ సమస్యలు వెల్లువెత్తుతు న్నాయి. పారిశ్రామికంగా గణనీయమైన అభివృద్ధి ఫలాలను దేశానికి అందించే కార్మికుల కుటుంబాలకు కనీస సౌకర్యాలు కనుమరుగు అవుతున్నా యి. యేటా కాలనీకి అనుగుణంగా వచ్చే మార్పు లతో కార్మిక కుటుంబాలకు సీజన్ అవస్థలు తప్పడం లేదు. వేసవిలో తాగు నీటి కష్టాలు కార్మిక కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రోజు విడిచి రోజు నీటి సరఫరాతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. ఏళ్ళు గడుస్తున్నా తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపడంలో సింగరేణి చొరవ చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వర్షాకాలంలో సెంటినరీకాలనీలోని పరిసరాలు పందులు, కుక్కలు, కోతుల బెడద తీవ్ర రూపం దాల్చుతుంది. వీటితోపాటు తేలిక పాటి చినుకు పడిన క్వార్టర్స్ రూఫ్ లీకేజీలతో కార్మికులు సతమతమవుతున్నారు. ప్రతి క్వార్టర్స్ బ్లాక్ వెనుక ఏర్పాటు చేసిన డ్రైనేజీల్లో చెత్తాచెదారంతో నిండు కొని పారిశుధ్య కష్టాలు తప్పడం లేదు. సెంటినరీ కాలనీ పురుడు పోసుకున్న సమయంలో క్వార్టర్స్ బ్లాక్‌ల మధ్య ఏర్పాటు చేసిన అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. సమస్యల పరిష్కారంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే అపవాదును మూటగట్టుకుంటోంది. సెంటినరీ కాలనీలో మూడు జోన్‌లు ఏర్పాటు చేసిన క్వార్టర్స్‌కు దశాబ్దాల కాలంగా రంగులు వేయడం లేదు. కార్మికుల కుటుంబాల్లో వచ్చే శుభాకార్యక్రమాల సందర్భంగా సింగరేణి దృష్టి తీసుకువచ్చినట్లయితే ఆ క్వార్టర్లకు మాత్రమే సున్నం రంగు వేయిస్తున్నారే తప్ప అన్ని క్వార్టర్లకు వేయడం లేదు. క్వార్టర్లకు రంగులు వేయించడంపై యాజమాన్యం దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉత్పత్తి లక్ష్యాలపై రాజీ లేని పోరాటం చేస్తున్న కార్మికుల సమస్యలపై యాజమాన్యం స్పందించాల్సిన అవసరం ఉంది.

క్వార్టర్లకు రంగులు వేయించాలి


- డి. కొంరయ్య(కార్మికుడు)



సెంటినరీకాలనీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కాలనీలోని క్వార్టర్స్‌కు రంగులు పడలేదు. కార్మికుల సంక్షేమంపై సింగరేణి యాజమాన్యం శ్రద్ధ కనబరచాలి. ప్రస్తుతం బ్లాక్‌లను తెలిపే సైన్ బోర్డును ఏర్పాటు చేయాలి. పారిశ్రామిక ఉత్పత్తిలో లక్ష్యాలను మాత్రమే ప్రాధాన్యతను కల్పిస్తున్న యాజమాన్యం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతర్గత రోడ్లను నిర్మించాలి.

అంతర్గత రోడ్లు అభివృద్ధి చేయాలి

- వెంకటేశ్వర్లు(కార్మికుడు)



సెంటినరీకాలనీలో క్వార్టర్స్ బ్లాక్‌లలో పైప్‌లైన్‌ల ఏర్పాటు పనుల్లో అంతర్గత రోడ్లు పూర్తి ధ్వంసమయ్యాయి. గుంతలమయంగా మారిన రోడ్లను తిరిగి నిర్మాణం చేపట్టాలి. వర్షా కాలంలో వచ్చే రూఫ్ లీకేజీల నివారణకు చర్యలు తీసుకోవాలి. కాలనీలోని బోర్ల మరమ్మతుతోపాటు క్వార్టర్స్‌లో హౌజ్ వైరింగ్‌ను ఏర్పాటు చేయాలి.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గంగాధర, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్థానికుల వివరాల ప్రకారం.. కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్21టీ5511) 34మంది ప్రయాణికులతో హైదరాబాద్ వెళుతూ గంగాధర బస్‌స్టాండ్ సమీపంలో విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్థంభం విరిగి, విద్యుత్ తీగలుతెగి బస్సు ముందు పడి పోయాయి. అయితే తీగలు బస్సుపై పడి ఉంటే పెను ప్రమాదం జరిగేదని ప్రయాణికులు తెలిపారు. అప్రమత్తమైన బస్సుడ్రైవర్, స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించి కరెంటుసరఫరాను నిలిపివేయించారు. ప్రమాదంపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో చోరీలు

కోల్‌సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని బీ టైపు క్వార్టర్లలో మంగళవారం అర్ధరాత్రి తరువాత చోరీలు జరిగాయి. తాళం వేసి ఉన్న ఆరు క్వార్టర్లలో చొరబడ్డ దొంగలు సామగ్రిని చిందరవందర చేశారు. నగదు, ఆభరణాలు క్వార్టర్లలో లేవని యజమానులు పేర్కొంటున్నారు. ఈ క్వార్టర్లలో ఇటీవల ఉద్యోగాల్లో చేరిన వారు ఉంటుండంతో సామగ్రి పెద్దగా లేదు. ఎన్‌టీపీసీ పోలీసులు, క్లూస్ టీమ్‌లు పరిశీలించాయి.

డాక్ సేవకులకు అందని వేతనాలు



- పట్టించుకోని అధికారులు
- రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు

భగత్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజరి కనికరించని చందంగా భారతీయ తపాలా శాఖలో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవకుల పరిస్థితి తయారైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది సంఖ్యలో స్టాఫ్‌గ్యాప్ పోస్ట్‌మెన్, గ్రామీణ్ డాక్ సేవకులు పనిచేస్తున్నారు. తపాల శాఖలోని పనులన్నీ చక్కబెడుతున్నా అధికారులు పట్టించు కోవడం లేదు. గ్రామీణ్ డాక్ సేవకులకు సంబంధిం చిన సెలవు, డిప్యూటేషన్, డిశ్చార్జ్, టెర్మినేషన్ ద్వారా ఏర్పడ్డ ఖాళీల్లో పని చేస్తున్న గ్రామీణ్ డాక్ సేవకులకు వేతనాలు చెల్లించాలని జూన్ 13వతేదీన తపాలా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జిల్లాలోని తపాల శాఖ కార్యాలయాలకు నెం. పిఎంజి (హెచ్) ఈఎస్‌టి-3/ జీడిఎస్ మ్యాటర్స్ 2025ను పంపించారు. అయినా వీరికి సంబంధించిన సమస్యలను స్థానికంగా పరిష్కరించడం లేదని గ్రామీణ్ డాక్ సేవకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● రోజు వారీ ఖర్చులు

నిత్యం సబ్ పోస్టాఫీసుల నుంచి ఉత్తరాలను బట్వాడా చేయడానికి ద్విచక్ర వాహనాల్లో వంద రూపాయలకు పైగా పెట్రోల్‌కు ఖర్చు అవుతుందని గ్రామీణ్ డాక్ సేవకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులతో పాటు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు విధులు నిర్వహిస్తున్నామంటున్నారు. జిల్లాస్థాయిలోని అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తమ సమస్యలు తీసుకువెళ్లినా పరిష్కరించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా తమకు రావాల్సిన వేతనాలతోపాటు, సమస్యలను పరిష్కరించాలని గ్రామీణ్ డాక్ సేవకులు కోరుతున్నారు.

విధుల నిర్వహణకే అప్పులు చేస్తున్నాం

యూరా గిరిప్రసాద్, స్టాఫ్ గ్యాప్ పోస్ట్‌మన్, ఆరెపల్లి



రోజు వారీగా విధులు నిర్వర్తించేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. నిత్యం ఉత్తరాలు బట్వాడా చేయడానికి ద్విచక్ర వాహనంలో పెట్రోల్ ఖర్చులకోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. తక్కువ జీతాలు ఉన్నా సర్దుకుపోతూ పని చేస్తున్నా సమయానికి వేతనాలు ఇవ్వడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

అధికారులు చర్యలు తీసుకోవాలి

బొల్లం నిఖిల్, స్టాఫ్ గ్యాప్ పోస్ట్‌మన్, మానకొండూరు



గ్రామీణ్ డాక్ సేవకులకు వేతనాలు ఇప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదు. తపాల శాఖ జాతీయ సంస్థ అయినందున కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ తమ సమస్యకు పరిష్కారం చూపించాలి.

ఇజ్రాయెల్ నుంచి స్వస్థలానికి మృతదేహం

- జూన్ 16న గుండెపోటుతో జగిత్యాల వాసి మృతి



రవీందర్ శవపేటికపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జగిత్యాల అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయెల్‌లో గుండెపోటుతో మృతిచెందిన రేవెళ్ల రవీందర్(57) అనేవ్యక్తి మృతదేహం బుధవారం స్వస్థలమైన జగిత్యాలకు చేరుకుంది. బతుకు దెరువు కోసం ఇజ్రాయెల్ వెళ్లిన రవీందర్ గుండెపోటుతో జూన్16న తన గదిలో మృతి చెందాడు. అప్పుడు ఇజ్రాయెల్‌లో యుద్ధనేపథ్యంలో రవీందర్ మృతదేహన్ని తీసుకురావడానికి ఇబ్బందులు ఎదురవడంతో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలు ఎన్నారై అడ్వైజరీకమిటీ చైర్మన్ మంద బీంరెడ్డితో మాట్లాడి జగిత్యాలకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకున్నారు. రవీందర్ మృతదేహన్ని ఎయిర్ అంబులెన్స్ ద్వారా జోర్డాన్‌కు తీసుకువచ్చి అక్కడి నుంచి బుధవారం ఉదయం హైదరాబాద్‌కు తరలించారు. దీంతో రవీందర్ బంధువులతోపాటు జగిత్యాల మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ అడువాల జ్యోతి బుధవారం ఎయిర్‌పోర్టుకు వెళ్లి మృతదేహన్ని జగిత్యాల పట్టణానికి తీసుకువచ్చారు. రవీందర్ కుటుంబసభ్యులు శవపేటికపై పడి రోదించారు. రవీందర్ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో పాటు అడువాల జ్యోతి, లక్ష్మణ్ పాల్గొన్నారు. రవీందర్ కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ అడువాల జ్యోతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి బలవన్మరణం

కోరుట్ల రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్లమండలంలోని అయిలాపూర్ గ్రామానికిచెందిన షైలారం గోపాల్(52) బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. గోపాల్ మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామపంచాయతీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ విద్యుత్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. కొద్దికాలం క్రితం గోపాల్‌కు గుండె నొప్పి రాగా స్టంట్ వేశారు. ఆపరేషన్‌కు చేసిన అప్పుతోపాటు ఆరోగ్య సమస్యలతో మనస్థాపం చెందిన గోపాల్ బుధవారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం పనులకు వెళ్లేవారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గోపాల్ కుమారుడు నమన్‌తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని.. యువకుడి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి

ధర్మపురి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని ధర్మపురి మండలం తీగలధర్మారం గ్రామంలో అలకుంట రాజశేఖర్ (27) అనే యువకుడి పురుగుల మందుతాగగా బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాజశేఖర్‌కు 8సంవత్సరాల క్రితం ధర్మపురికి చెందిన జ్యోతితో వివాహం అయ్యింది. జీవనోపాధి నిమిత్తం రాజశేఖర్ దుబాయ్ వెళ్లగా భార్య జ్యోతి తనపుట్టింటికి వెళ్లింది. రెండునెలల క్రితం రాజశేఖర్‌ను దుబాయ్ నుంచి ఇంటికి రమ్మని భార్య ఫోన్ చేయగా తిరిగి వచ్చాడు. నెలరోజులక్రితం జ్యోతి తనభర్త రాజశేఖర్‌తో గొడవ పెట్టుకుని ఇంటి నుండి వెళ్లి పోయింది. ఈనెల 1న సాయంత్రం భార్యతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం మామిడితోటలో పురుగుల మందుతాగాడు. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి రాజశేఖర్ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి ఒక కొడుకు ఉన్నాడు. రాజశేఖర్ తల్లి ఆలకుంట శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కోరుట్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని అయోధ్యపట్నం సమీపంలో గుర్తుతెలియని వాహనంఢీకొని అదేకాలనీకి చెందిన కొరిమెల లక్ష్మణ్(57) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మణ్ పశువైద్య కళాశాల సమీపంలో మొక్కజొన్నకాల్చి అమ్ముతూ జీవిస్తుంటాడు. మంగళవారంరాత్రి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వెనుకనుంచి ఢీకొట్టడంతో లక్ష్మణ్ సంఘటనస్థలంలో మృతిచెందాడు. గమనించినస్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. భార్య రాజవ్వ ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



రాజ్‌కుమార్, గణేష్(ఫైల్)

కొడిమ్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సమీపంలో బుధవారం ద్విచక్రవాహనం చెట్టును ఢీ కొనడంతో ఇద్దరు యువకులు జడ గణేష్(21), దయ్యాల రాజ్‌కుమార్(22)అక్కడికక్కడే మృతి చెందారు. మల్యాల మండలకేంద్రానికి చెందిన ఇద్దరు మిత్రులు గణేష్, రాజ్‌కుమార్ మొహర్రం వేడుకల్లో ఉపయోగించే పులిమాస్కుల కోసం నల్లగొండకు వెళ్తున్నామని ఇంట్లో చెప్పి ద్విచక్రవాహనంపై వచ్చారు. అనంతరం నల్లగొండనుంచి వేములవాడవైపు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్నచెట్టును ఢీకొట్టింది. దీంతోఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు గణేష్ తల్లి జడలత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

సైదాబాద్‌లో చోరీ

- రూ.26వేలు, 12తులాల వెండి మాయం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణగౌడ్

జమ్మికుంట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామంలో తాళంవేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్ గ్రామానికి చెందిన వేముల సత్యనారాయణ ఉదయం 11 గంటలకు పని నిమిత్తం జమ్మికుంటకు వెళ్లాడు. తన భార్య సుజాత ఉదయం 11.50గంటలకు ఇంటికి తాళం వేసి వన భోజనాలకు వెళ్లింది. సత్యనారాయణ పనులు ముగించుకొని మధ్యాహ్నం 12.30గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. ఇంటి తాళం పగులగొట్టి ఉండగా లోనికి వెళ్లి చూశాడు. ఇంట్లోని సామగ్రి చిందర వందరగా పడేసి ఉంది. అనుమానం వచ్చి బీర్వాను తీసి చూడగా అందులోని రూ.26వేల నగదు, 12తులాల వెండి పట్ట గొలుసులు చోరీకి గురైనట్లు నిర్ధారణకు వచ్చాడు. వెంటనే పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయాన్ని తెలిపాడు. బాధితుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్‌రామకృష్ణగౌడ్ తెలిపారు.

ఫ్యాకల్టీ కోసం డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఆందోళన

- ఫైన్‌ఆర్ట్స్ కోర్సు మెటీరియల్, ఫ్యాకల్టీ లేక ఇబ్బందులు
- గంటపాటు రాస్తారోకో
- అధికారుల హామీతో విరమణ



రాస్తారోకో చేస్తున్న విద్యార్థినులు

తంగళ్లపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఫైన్‌ఆర్ట్స్ కోర్సుల్లో మెటీరియల్, సరైన ఫ్యాకల్టీ లేదంటూ మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీకళాశాల విద్యార్థులు రోడ్డెక్కారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై విద్యార్థినులు సుమారు గంటపాటు ఆందోళన నిర్వహించారు. సుమారు 200మంది విద్యార్థులు కళాశాల నుంచి అర కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రధాన రహదారికి చేరుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లడుతూ మూడునెలలుగా మెటీరియల్ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఫ్యాకల్టీ లేక తమ చదువులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా గెస్ట్ ఫ్యాకల్టీలకు వేతనం రాకపోవడంతో వారు సక్రమంగా చదువులు చెప్పడం లేదన్నారు. మెటీరియల్ లేక, సరైన ఫ్యాకల్టీ లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఉపేంద్రచారి సిబ్బందితో చేరుకుని ఆందోళన విరమించాలని కోరగా విద్యార్థినులు ససేమిరా అనడంతో కళాశాల ప్రిన్సిపాల్, తహసీల్దార్‌లకు సమాచారం అందించారు. తహసీల్దార్ జయంత్‌కుమార్, ప్రిన్సిపాల్‌లు విద్యార్థులకు నచ్చచెప్పి రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామనడంతో ఆందోళన విరమించారు.

కన్నపేగు కనికరించింది

- ఊయలలో వేసిన బాబును తిరిగి ఇవ్వాలని దంపతుల వేడుకోలు
- అప్పగించిన అధికారులు

కరీంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కన్నపేగు కనికరిచింది. ఊయలలో వదిలి వెళ్లిన తమ కుమారుడిని తిరిగి ఇవ్వాలని తల్లిదండ్రులు అధికారులను వేడుకున్నారు. బుధవారం బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ)కి మొరపెట్టుకున్నారు. గతనెల 28న ఆరోగ్యపరిస్థితి బాగలేదని ఓ బాబును తల్లిదండ్రులు కరీంనగర్ జిల్లాకేంద్రంలోని మాతాశిశు సంక్షేమకేంద్రంలోని ఊయలలో వేసి వెళ్లారు. అనంతరం సంబంధిత అధికారులు బాబును శిశుగృహానికి తరలించారు. ఇంతలోనే ఏమైందో గానీ వద్దనుకున్న తల్లిదండ్రులు మళ్లీ తమ బాబు కావాలని జిల్లా సంక్షేమసమితి ముందుకు వచ్చి ప్రాధేయపడ్డారు. వారిఅభ్యర్థనను పరిశీలించిన సీడబ్ల్యూసీ వారే తల్లిదండ్రులని నిర్ధారణకు వచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి, జిల్లాపరిషత్ కార్యాలయంలోని బాలరక్ష భవన్‌లో బాబును అప్పగించారు. తమ బిడ్డను క్షేమంగా తమకు అప్పగించినందుకు జిల్లాయంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

సెంట్రింగ్ కార్మికుడి ఆత్మహత్య

జ్యోతినగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ ఐదవ డివిజన్ పరిధి మల్కాపూర్‌లో బుధవారం శ్రీరాముల రవి(44) అనేసెంట్రింగ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లోఎవరూలేని సమయంలో సీలింగ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేని కారణంగానే రవి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- బంగారు నగలు, వెండి స్వాధీనం ముగ్గురు అరెస్టు, ఒకరు పరారీ



దొంగల ముఠా అరెస్టును చూపుతున్న పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ

పెద్దపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో దొంగతనాలకు పాల్పడ్డ అంతర్రాష్ట్ర ముగ్గురు దొంగలను అరెస్టు చేశామని, ఒకరు పరారీలో ఉన్నారని పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ వెల్లడించారు. వారి నుంచి బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పెద్దపల్లి పట్టణం భూమ్‌నగర్‌లోని వెంకటేశ్వర రెసిడెన్సీలో నివాసం ఉంటున్న కొట్టె శ్రీవిద్య మే 25న పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అదేనెల 27న వారి ఇంటితాళం పగులగొట్టి ఉండటంతో సమాచారం మేరకు వచ్చి చూడగా, ఇంట్లో దాచుకున్న 58గ్రాముల బంగారు ఆభరణాలు, 1260గ్రాములు వెండి, రూ.30వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు.

అదే అపార్ట్మెంట్‌లో నివాసం ఉంటున్న గుండు అనూష ఇంటితాళం పగులగొట్టి 8గ్రాములు బంగారం, 300గ్రాములు వెండి ఆభరణాలు, 10 వేల నగదు దొంగిలించినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. ఈ చోరీ లకు పాల్పడ్డ హైదరాబాద్‌లోని మల్కాజిగిరి మేడ్చల్లోని హనుమాన్ నగర్‌కు చెందిన సద్దాం అలీ, బాలాజీ నగర్‌కు చెందిన అన్వార్ అలీ, మంచిర్యాల జాఫర్ నగర్ కి చెందిన మహమ్మద్ సలాంలను అరెస్ట్ చేశామని, సలీం అనేవ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

అరెస్ట్ అయిన నిందితుల నుంచి 23.28గ్రాముల డైమండ్ నక్లేస్, 14.80 గ్రాముల నల్ల పూసల దండ, 11.30గ్రాములు బంగారు ఉంగరాలు, చెవి కమ్మలు, స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే 600గ్రాములు వెండిపళ్లెం, 250గ్రాములు అష్టలక్ష్మి చెంబు, 35గ్రాములు గ్లాస్‌లు, 5గ్రాముల రెండు చెంచాలు, 60గ్రాముల మాణిక్యాలు, 50గ్రాముల పంచె పాల, 62 గ్రాముల గిన్నెలు,207 గ్రాముల వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు లక్ష్మణరావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

- నలుగురిపై కేసు నమోదు

తిమ్మాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్ శివారులో బుధవారం మానకొండూర్ మండలం లింగపూర్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. పట్టుకున్న రెండు ఇసుకట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి యాజమానులు, డ్రైవర్లు అయిన ఉప్పుల సంపత్, వరికొప్పుల అంజనేయులు, కందుకూరి శ్రీనివాస్, మోదుంపల్లి హరీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

యువకుడి అదృశ్యం



అనిల్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన మర్రి బోయిన అనిల్ అనే యువకుడు జూన్ 25 నుంచి అదృశ్యమయ్యాడని కుటుంబసభ్యులు త్రీటౌన్‌లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. జూన్25న రాత్రి ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన అనిల్ తిరిగిరాలేదు. అతనికోసం గాలించిన కుటుంబసభ్యులు ఫలితం లేకపోవడంతో పోలీసు లకు ఫిర్యాదు చేశారు. అనిల్ సమాచారం తెలిసిన వారు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లోగాని, 7330684590, 9849926649 నంబర్స్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

నిత్యం ఆధ్యాత్మిక శోభ




మద్దుట్ల గ్రామంలోని హనుమాన్ ఆలయం

- గంటకోసారి మైకుల్లో భగవద్గీత
- మద్దుట్లలో భక్తిభావం

మల్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మద్దుట్లలో ప్రతీ రోజు తెల్లవారుజామున భగవద్గీత శ్లోకాలతో గ్రామస్థులు నిద్రలేస్తారు. కోడి కూతకు ముందే భక్తి గీతాలు గ్రామస్థుల్లో ఆధ్యాత్మిక భావాన్ని నింపుతున్నాయి. రాత్రి కూడా భగవద్గీత విని నిద్రలోకి జారుకోవడం మద్దుట్ల గ్రామంలో దైనందిన కార్యక్రమంగా కొనసాగుతోంది. దీంతో గ్రామస్థులు భక్తిభావంతో తన్మయత్వం పొందుతున్నారు. మే నెలలో గ్రామస్థులు తలా కొంత సొమ్ము పోగు చేసి రూ.1.50లక్షలతో స్థానిక హనుమాన్ ఆలయంలో మైక్ సెట్ పరికరాలు అమర్చారు. గ్రామంలో మూడు ప్రధాన కూడళ్ల వద్ద మైకులు ఏర్పాటు చేశారు. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు గంటకోసారి ఊరంతా భక్తి గీతాలు మైమరిపిస్తున్నాయి.

● గంటకోసారి సమయం, భక్తిగీతాలు



మద్దుట్లలో ఏర్పాటు చేసిన మైక్ సెట్‌లో ప్రతీ రోజు ఉదయం ఐదు గంటలకు సమయం, వారం పేర్కొంటూ ఆ రోజు ప్రాశస్త్యం తెలిపే భక్తి గీతాలు వస్తుంటాయి. ఉదాహరణకు సోమవారం అయితే శివుడికి సంబంధించిన భక్తి గీతాలు వస్తుంటాయి. దీంతో గ్రామస్థులు భక్తిభావంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భక్తి గీతాలతో మేల్కొంటున్నాం: లావణ్య, మద్దుట్ల గ్రామం



మైక్‌ల ద్వారా భక్తి గీతాలు రాగానే ఊరంతా మేల్కొంటుంది. నేను కూడా మైకులో భగవద్గీత శ్లోకాలు మొదలవగానే మేల్కొని పనులు ప్రారంభిస్తున్నాం. గంటకోసారి భక్తి గీతాలు రావడంతో గ్రామంలోని ప్రతీ ఒక్కరిలో ఆధ్యాత్మిక భావం నెలకొం టోంది. భక్తి గీతాలతో పాటు సమయం సులువుగా తెలుస్తోంది. గ్రామస్థులమంతా మైకుల ద్వారా భగవద్గీత గురించి పూర్తిగా తెలుసుకుంటున్నాం.



గ్రామంలో ఏర్పాటు చేసిన మైకులు

గంజాయి రవాణా చేస్తున్న నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ పోలీసులు తీగలగుట్టపల్లిలోని రైల్వేగేట్‌సమీపంలో బుధవారం గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుల అరెస్టు చూపించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... రూరల్ ఎస్సై పి లక్ష్మారెడ్డి సిబ్బందితో కలిసి తీగలగుట్టపల్లి లోని రైల్వేగేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఒక బైక్ పై కరీంనగర్ నుంచి వస్తూ పోలీస్ వారిని చూసి పారిపోబోయారు. పోలీసులు స్పందించి వారిని పట్టుకున్నారు. వారివద్ద మూడు కవర్లలో అరకిలో గంజాయి ఉంది. బుట్టిరాజారాం కాలనీకి చెందిన బండెల మణిదీక్షిత్, కిసాన్‌నగర్‌కుచెందిన జపతి సిద్దార్థతో పాటు మరో బాలుడు కలిసిగంజాయి తరలిస్తున్నారని తేలడంతో వారిని అరెస్టు చేశారు. నిందితుడు మణిదీక్షిత్ గతంలో ఆంధ్రప్రదేశ్ సీలేరు నుంచి గంజాయి రవాణా చేసి పోలీసులకు చిక్కి జైలు శిక్ష అనుభవించాడని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.



పట్టు వస్త్రాల కొనుగోలులో జాగ్రత్త



- ఆషాఢంలో పట్టు చీరలకు భారీగా ఆఫర్లు
- మార్కెట్లోకి నకిలీ పట్టువస్త్రాలు రాక

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఆషాఢం.. అనగానే ఆఫర్లు ఇచ్చే కాలం అని గుర్తుకొస్తుంది.. అందులోనూ వస్త్రాల విక్రయాలపైనే వ్యాపారులు ఎక్కువగా దృష్టి సారిస్తారు. చీరలపైన బంపర్ ఆఫర్లు అంటూ అదరగొట్టేస్తారు. మహిళల హుందాతనానికి ఎన్ని ఫ్యాషన్లు వచ్చినా చీరలకు ఉన్న ప్రత్యేకత దేనిలోనూ ఉండదు. మగువలు చీర కడితే.. అందానికే అందం వస్తుంది. అలాంటి అందాన్నిచ్చే చీరల్లో పట్టుచీరలకు మరో ప్రత్యేకత ఉంటుంది. ఆషాఢం మాసం తర్వాత వచ్చేది శ్రావణం... పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాల జోరు ఉంటుంది. దాన్ని దృష్టిలో పెట్టుకొని మహిళలు ఆషాడంలో ఇచ్చే ఆఫర్లతో పట్టు చీరలను కొనుగోలు చేస్తారు. శుభకార్యాల్లో ప్రత్యేకంగా కనిపించడానికి పలు డిజైన్ల చీరలతో పాటు పట్టు చీరలను కొనుగోలు చేస్తారు. ఇందుకు అనుగుణంగా మార్కెట్లో కూడా పట్టు చీరలు అమ్మకాల కోసం వ్యాపారులు పలు రకాల చీరలు తీసుకొచ్చారు. పట్టుచీరల తయారీకి ఎక్కువ సమయం పడుతుంది. అందుకే ఖరీదు కూడా ఎక్కువగానే ఉంటాయి.

మార్కెట్లో అసలైన పట్టు వస్త్రాల ఖరీదు ఎక్కువగానే ఉంటుంది. రూ.3 వేల నుంచి రూ.లక్షకు పైగా ధరలు ఉన్నాయి. మార్కెట్లో అసలైన పట్టు వస్త్రాల ఖరీదు కనీసం రూ.5వేల పైనే మొదలవుతుంది. ధర్మవరం, హిందూపురం, పోచంపల్లి, ఉప్పాడ, మహారాష్ట్ర, పైతాని వీటితో పాటు ఇంకా రకరకాల చీరలు మార్కెట్లో ఉన్నాయి. మల్బరీలో రీల్ మల్బరీ, డుపీయాన్, స్పిన్, నాయి, మట్కా, త్రోస్టర్ తదితర రకాలతో పాటు టస్సర్‌లో రీల్డ్ టస్సర్, రీచా, కటియ, జరీ వంటివి కూడా పట్టులో వాడిన దారాలను రంగులు కలిపి వస్త్రాలను తయారుచేస్తారు.

జాగ్రత్తగా పరిశీలించాలి..

పట్టు వస్త్రాల తయారీలో కొంత మెరుపులు ఉన్నా వాటిని జాగ్రత్తగా పరిశీలించాలి. మల్బరీ సిల్క్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. మార్కెట్లో అసలైన పట్టును గుర్తించాలంటే యానిమల్ ఫైబర్ జుట్టు ఊలు మాదిరిగా ఉంటుంది. దీని దారం పోగులను చివరి భాగంలో కత్తిరించి కాల్చినప్పుడు జుట్టు కాలిన వాసన వస్తుంది. పట్టు అయితే కాలకుండా వెంటనే ఆగిపోతుంది. అలాగే గుండ్రంగా పూసలా మారుతుంది. పట్టు వస్త్రాలకు నీళ్లను ఎక్కువగా పీల్చుకునే, వదిలించుకునే గుణాలు కలిగి ఉంటాయి. దీనివల్ల నీళ్లలో ఎక్కువ సమయం ఉంచితే రంగుపోతుంది. పట్టు వస్త్రాలను ఉతికి శుభ్రం చేసే సమయంలో గోరు వెచ్చని మంచినీటిని ఉపయోగించాలి. నీళ్లలో బేబీషాంపు లాంటివి ఉపయోగించవచ్చు. పట్టువస్త్రాలను ఎక్కువ కాలం ఒకేలాగ మడతలు ఉంచవద్దు. మార్దవం మంచిది.

ఘనంగా వారాహీ గుప్త నవరాత్రి ఉత్సవాలు



అమ్మ వారికి పూజలు చేస్తున్న మహిళలు

సుల్తానాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వారాహీ గుప్త నవరాత్రి ఉత్సవాలు సుల్తానాబాద్ లో ఘనంగా జరుగుతున్నాయి. ఆషాఢమాసం ఆరంభంతోనే వారాహీ అమ్మ వారి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలోని సాంబశివ దేవాలయంలో రోజు రాత్రి పూజలు వైభవంగా జరుగుతున్నాయి. రోజుకు ఒక్క తీరుగా వివిధ నైవేద్యాలను అమ్మ వారికి సమర్పిస్తున్నారు. రోజు కుంకుమ అర్చనలు వారాహీ అష్టోత్తరాలు సామూహికంగా పారాయణం చేస్తున్నారు. బుధవారం రాత్రి ఏడవ రోజు పూజలలో భాగంగా అమ్మవారికి లఘు వారాహీ దేవి అవతారంగా భావిస్తూ పలు పూజలు చేశారు. అమ్మ వారికి కొబ్బరి తురుము, శర్కర, బెల్లపు అన్నం, వివిధ రకాల డ్రై ఫ్రూట్స్ నైవేద్యంగా సమర్పించారు.

మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు



చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం బోయినపల్లిలో జరిగిన రైతు భరోసా సంబరాల కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ కుమార్ ముంపు గ్రామాలకు చేసిందేమీ లేదన్నారు. నిర్వాసితుల పెండింగ్ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, ఒక్కో సమస్యను పరిష్కరిస్తామన్నారు. అంతేకాకుండా నిర్వాసిత యువతకు ఉపాధి చూపించేందుకు ముంపు గ్రామాల్లో కుటీర పరిశ్రమలు సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ముంపు గ్రామాల ఐక్య వేదిక కన్వీనర్ కుస రవీందర్, నాగుల వంశీ తదితరులు ఉన్నారు.

ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులకు ఇంటర్వ్యూలు

పెద్దపల్లిటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 7న ఉదయం 11 గంటలకు హాజరు కావాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 3 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్, 1 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (ఎంబీబీఎస్) పోస్టులను కాం ట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని తెలిపారు. ఆసక్తి గల వైద్యులు బయోడేటాతోపాటు ఒరిజినల్, జిరాక్స్‌ప్రతితో హాజరు కావాలని, జనరల్ సర్జరీ గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్స్ నిపుణులకు మొదట ప్రాధాన్యం ఉంటుందని, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు రూ. లక్ష, సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు నెలకు రూ. 53 వేల 3 వందల 51ల వేతనం ఉంటుందని, వివరాలకు కార్యాలయంలోసంప్రదించాలని పేర్కొన్నారు.

పీఈటీ పోస్టులకు రోస్టర్ కమ్ మెరిట్ ప్రకారం ఎంపిక

గణేశ్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని కేజీబీవీల్లో పీఈటీ పోస్టుల భర్తీకి (కాంట్రాక్టు పద్ధతిన) 2023లో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులను రోస్టర్ కమ్ మెరిట్ ప్రకారం ఎంపిక చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 1:3 రేషియో ప్రకారం ఫోన్ కాల్ లేదా మెస్సేజ్ ద్వారా పిలవనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో శుక్రవారం ఉదయం 11 గంటలకు కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హాజరుకావాలని తెలిపారు.

సంగీత కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మంథని, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కర్ణాటక గాత్రం, కూచిపూడి, పేరణి నృత్యం, మృదంగం, వీణా, వయోలిన్ కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి కల్గిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ కోర్సుల్లో చేరటానికి 10 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులన్నారు. ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉందన్నారు. వివరాలకు 08729-279927లో సంప్రదించాలన్నారు.

ఇంకుడు గుంతలతో నీటి సమస్యకు చెక్



- ఏర్పాటుకు ఆసక్తి చూపని ప్రజలు
- వృథాగా పోతున్న వర్షపు నీరు

జమ్మికుంట రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ప్రతి ఏడాది వేసవిలో నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో నీటిని కొనుగోలు చేసే పరిస్థితులు వస్తున్నాయి. వర్షకాలంలో నీటిని ఒడిసి పడితే భూగర్భ జలాలు పెంచుకునే అవకాశం ఉన్నా ప్రజలు ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదు. ప్రతీ ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని భూమిలోకి పోయేలా చేస్తే నీటి సమస్య ఉండదు. భూగర్భ జలాలు పెరగడంతో పాటు బోర్లు, బావులు నీటితో కలకలలాడుతాయి. ప్రజలు చుక్క నీరు భూమిలో ఇంకకుండా ఇళ్ల పరిసరాలను కాంక్రీట్‌తో మూసి వేస్తున్నారు. ఫలితంగా వర్షపు నీరు నిలవడం లేదు. వేసవిలో బోర్లు, బావులు ఎండిపోయి నీటికి కటకట ఏర్పడుతోంది.

అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

ప్రభుత్వం ఇంకుడు గుంతల ఏర్పాటుతో భూగర్భ జల సంరక్షణ ఏ విధంగా సాధ్యమవుతుందో ప్రజలకు వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. గుంతలు ఏర్పాటు చేసుకోనే విధానన్ని ప్రజలకు వివరించాలి. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటనే ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తామని కచ్చితమైన ఆదేశాలు జారీ చేయాలి. ప్రస్తుతం వర్షకాలం రావడంతో ఇప్పటికే ఉన్న ఇంకు డు గుంతలు శుభ్రం చేసి వాన నీరు ఇంకేలా చర్యలు తీసుకోవాలి.

నిబంధనలు బేఖాతరు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్తగా నిర్మించే ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కువ మంది ఇంటి యాజమానులు నిబంధనలు పాటించకుండా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. మరికొందరు లేని ఇంకుడు గుంతలను ఉన్నట్లుగా చూపి ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు.

ఇంకుడు గుంత నిర్మాణం ఇలా...

ఇంకుడు గుంత 1.2 మీటర్ల పొడవు, 1.2 మీటర్ల వెడల్పు, 1.8 మీటర్ల లోతు ఉండాలి. అడుగు భాగంలో పీటున్నర మందం రాళ్లు, దానిపై పీటున్నర 40ఎంఎం కంకర, వాటిపైన 3 ఫీట్ల రింగ్ అమర్చాలి. దీనిపై మూత ఏర్పాటు చేసి ఐదు మీటర్ల పైపును బిగించాలి. ఇరుపక్కల 20 ఎంఎం కంకర నింపాలి. వర్షం కురిసినప్పుడు, ఇతర సమయాల్లో వృథాగా పోయే నీటిని ఇంకుడు గుంతలోకి మళ్లించాలి.



ఎస్సారెస్పీకి పెరుగుతున్న ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 6,713 క్యూసెక్కుల నీరు రాక



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం కొద్దికొద్దిగా వరద పెరుగుతోంది. డ్యామ్‌లోకి 6,713 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 16.405 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 10.835 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 635 క్యూసెక్కుల నీటి ని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.327 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 1.710 టీఎంసీల నీటిని వ్యయం చేశారు.

జాతీయ రైఫిల్ పోటీలకు సాగర్ ఎంపిక



కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జాతీ య స్థాయి రైఫిల్ పోటీలకు జిల్లాకు చెందిన సి. సాగర్ ఎంపికయ్యారు. గత నెల హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 25 మీటర్ల రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ కనబరిచాడు. సాగర్ కరీంనగర్‌కు చెందిన సీనియర్ షూటర్ సర్దార్ అమన్‌జీత్‌సింగ్ ఆధ్వర్యంలో ఏడాది పాటు శిక్షణ తీసుకున్నాడు. ఈ సందర్భంగా సాగర్‌ను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్, షూటింగ్ సంఘాల సభ్యులు అభినందించారు.

ఫిజికల్ డైరెక్టర్ రవీందర్‌కు డాక్టరేట్



కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 2(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఖోఖో క్రీడాకారుడు ఫిజికల్ డైరెక్టర్ అనంతుల రవీందర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహి స్తున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఫిజికల్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ఎలైట్ ఖోఖో ప్లేయర్స్ ఆఫ్ తెలంగాణ అనే అంశంపై పరిశోధన చేసినందుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదా నం చేసింది. ప్రొఫెసర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టరేట్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌ను ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదిర్శ మహేందర్ రావు, ఖోఖో సంఘం సభ్యులు అభినందించారు.

లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత



లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

భగత్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా భవన నిర్మాణ కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కమిషనర్‌కు కార్మికులు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష పూరితంగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జూలై 9న దేశ వ్యాప్త సమ్మెలో జిల్లాలోని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజ యవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజే శం,కదిరె రమేష్, నర్సయ్య, రమేష్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థికి అస్వస్థత



అస్వస్థతకు గురైన విద్యార్థి నవనీత్

మెట్‌పల్లి రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి నవనీత్ బుధవారం అస్వస్థతకు గురయ్యాడు. విద్యార్థి కాలుకు దురద రావడంతో గమనించిన ప్రిన్సిపాల్ వెంటనే కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బుధవారం రాత్రి భోజనం చేసినంతరం కాలుకు దురుదగా ఉందని ఎనిమిదో తరగతి విద్యార్థి నవనీత్ ఉపాధ్యాయులకు తెలిపాడు. వారు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లగా విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించి కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. రిపోర్టుల్లో ఎలాంటి సమస్య లేదని వచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అయినప్పటికీ ముందు జాగ్రత్తగా వైద్యుల పర్యవేక్షణ కోసం ఆసుపత్రిలో ఉంచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు





ఆర్నకొండ నుంచి రాగంపేట, రుక్మాపూర్ నుంచి కాట్నపల్లి వెళ్లే రోడ్డు

చొప్పదండి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. కొన్నేళ్లుగా రోడ్లకు ఎలాంటి మరమతులు చేపట్టలేదు. రుక్మాపూర్ నుంచి కరీంనగర్ మండలం ఫకీరుపేట రోడ్డు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్నకొండ నుంచి మల్యాల వరకు రోడ్డు మరమ్మతుల కోసం రెండేళ్ల క్రితమే నిధులు మంజూరయ్యాయి. రోడ్డును మూడు బిట్లుగా విభజించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పారు.

ఆర్నకొండ నుంచి గోపాలరావుపేట, బూరుగుపల్లి వరకు అక్కడి నుంచి మల్యాల వరకు రోడ్డును మూడు బిట్లుగా విభజించారు. పనులు మొదలయ్యే క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. తిరిగి ఇప్పటి వరకు కనీసం మరమతులు చేపట్టకపోవడం గమనార్హం. వానలకు రోడ్డు బాగా దెబ్బ తినగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్నకొండ నుంచి రాగంపేట, రేవెల్లి, గోపాల్‌రావుపేట వరకు రోడ్డుకు మరమతులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రుక్మాపూర్ నుంచి కాట్నపల్లి రోడ్డు నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మరమతులు చేపట్టలేదు. చాకుంట నుంచి వెదురుగట్ట రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పచ్చగడ్డితో పాల దిగుబడి



పాడి పశువులకు పచ్చి మేత మేలు

గంగాధర, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పచ్చ గడ్డి పాడి పశువులకు ఎంతో మేలు చేస్తుంది. పాడి పశువులున్న రైతులు పశుపోషణపై ప్రత్యేక పద్ధతులు పాటిస్తే పాల దిగుబడి పెంచుకోవచ్చని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. గంగా ధర మండలంలో వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా 33 గ్రామ పంచాయతీల్లో పాల కోసం గేదెలను పెంచుకుంటున్నారు. మండల వ్యాప్తంగా సుమారుగా ఏడు వేల లీటర్ల పాల ఉత్పత్తి సాధిస్తున్నారు. మండల వ్యాప్తంగా సాగునీటి వసతి పెరగడంతో రైతులు ఎక్కువగా పొలం సాగు చేస్తున్నారు. దీంతో పశువులకు పచ్చి గడ్డి మేతకు కొంత ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది.

పశువులున్న రైతులు 10 గుంటల్లో ప్రత్యేకంగా గడ్డిని పెంచుతున్నారు. పచ్చి మేతలో పోషక విలువలు, విటమిన్లు ఎక్కువగా ఉండటం వల్ల పశువులు ఎదకు రావడానికి, ఇటు పాల ఉత్పత్తి పెరగడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. పచ్చి మేతలో గడ్డిజాతీ, కాయజాతిలో చిరు ధాన్యాల రకాలున్నాయి. వీటిలో మేలు రకాలు పలు మార్లు కోతకు వచ్చే వాటిని ఎంచుకుని విత్తు కోవాల ని పశు సంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు.

పశువులకు ఉపయోగకరం..

సందీప్‌రెడ్డి, పశువైద్యాధికారి గంగాధర



రైతులు పశువుల ఆరోగ్యం, పాల దిగుబడి కోసం తప్పని సరిగా గడ్డి జాతి మొక్కలను పెంచుకోవాలి. రైతులు తమకున్న పదోవంతు భూమిలో పశుగ్రాసం సాగు చేసుకుంటే పశువులకు ఎంతో ఉపయోగం. పచ్చగడ్డిని తినడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు పాలదిగుబడి పెరిగి లాభాలు పొందవచ్చు.

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గడ్డి విత్తనాలు

నేషనల్ లైవ్ స్టాక్ పథకంలో భాగంగా హైబ్రీడ్ సొర్గం మల్టీకట్ (సీఎస్‌హెచ్24ఎంఎఫ్) రకాన్ని కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తోంది. ఎకరాకు 20 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. వానా కాలం ముందు విత్తుకోవాల్సి ఉంటుంది.

విత్తనం ఇరవై రోజులకు మొలకెత్తుతుంది. ఐదు వందల క్వింటాళ్ల వరకు పచ్చగడ్డి ఉత్పత్తి వస్తుంది. ఒక్కసారి విత్తు కుంటే మూడు సార్లు కోతకు వస్తుంది. మొదటిసారి 60 రోజులకు, అనంతరం 40 రోజులకు ఒకసారి కోతకు వస్తుంది. గడ్డి ఆవులు, మేకలు, గొర్రెలు, గేదె లు తినడానికి చాలా మంచిది. ఇది అధిక ప్రొటీన్ కలిగిన పచ్చగడ్డి. విత్తనానికి ఖర్చు తక్కువ. అధిక పచ్చ గడ్డి ఉత్పత్తి కావడంతో దీనితో పశువులకు ఆరోగ్యంతో పాటు అధిక పాల దిగుబడి వస్తుంది.



పారిశుధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణాలలో టీయూఎఫ్ఐడీసీ ద్వారా చేపట్టిన అంతర్గత రోడ్లు, డ్రైయిన్ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సుల్తానాబాద్‌లో రోజూ తాగు నీటి సరఫరా చేయాలన్నారు. ప్రతి వార్డు పరిధిలో పారిశుధ్య నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల మీద చెత్త, ప్లాస్టిక్ ఉండటానికి వీలు లేదన్నారు. రోజూ ఉదయం పారిశుధ్య కార్మికుల పని తీరు మున్సిపల్ అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జూలై నెలాఖరు వరకు సుల్తానాబాద్ పట్టణంలో డంప్ యార్డు సమస్య పరిష్కరించాలన్నారు.

పర్యావరణ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లి టౌన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పోటీల పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం అవసరమన్నారు. ఈనెల 1 నుంచి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్లు అందుబాటులో ఉంటుందని, కేంద్ర విద్య, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహకారంతో ఈ పోటీని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫలితాలు ఆగస్టు 30న విడుదల చేస్తామన్నారు. ఈకో మిత్ర అనే మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. పలు భాషలలో క్విజ్ అందుబాటులో ఉంటుందని, మొక్క నాటుతున్న, నీరు సేవ్ చేస్తున్న లేదా వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీ ఫొటోను అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పోటీలో పాల్గొనాలన్నారు. జిల్లా విద్యాధికారి డి. మాధవి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పీఎం షేక్, జిల్లా జాతీయ హరితదళం కోఆర్డినేటర్ గూళ్ళ అంజన్‌కుమార్, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ సిహెచ్. మల్లేష్, జీసీడీవో కవిత, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వంట గది ప్రారంభం



వంట గదిని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

సుల్తానాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టికమైన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వ సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు గర్రెపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోల్డి బల్బీర్ కౌర్ అన్నారు. మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సొంత డబ్బులతోపాటు కొందరు దాతల సహకారంతో నిర్మించిన నూతన వంటశాలను బుధవారం ప్రిన్సిపాల్ ప్రారంభించారు. వంటశాల నిర్మాణానికి సహకరించిన దాతలకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

హోటళ్లలో నాణ్యమైన భోజనం అందించాలి

పెద్దపల్లిటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ బిజినెస్ చేసే వ్యాపారులు కస్టమర్లకు నాణ్యమైన భోజనం అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సూచించారు. మున్సిపల్ అధికారులు బుధవారం పలు బార్‌రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకొని పలు రెస్టారెంట్లకు 32 వేలు జరిమానా విధించారు. కమిషనర్ మాట్లాడుతూ నాణ్యత పాటించాలని, లేకుంటే జరిమానాతో పాటు దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. రమాకాంత్, అనిల్, పదీప్, శీనివాస్, సుధీర్, పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' నిర్మాణాల్లో పుంజుకున్న వేగం

(5వ పేజీ తరువాయి)

తీసి, వారి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఈ సర్వే ద్వారా ఎల్ 1 కేటగిరీ (సొంత స్థలాలు ఉన్న వాళ్లు)లో 62,061 మంది, ఎల్ 2 కేటగిరీ (సొంత స్థలాలు లేని వాళ్లు)లో 49,596 మంది, ఎల్ 3 కేటగిరీ (అనర్హులు) 65,217 మంది ఉన్నట్లు గుర్తించారు. ఈ ఏడాది జనవరి 26వ తేదీన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఆరంభించింది. మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆయా పథకాలకు ఎంత మంది అర్హులు ఉన్నారో వారందరికీ ఆ పథకాలను వర్తింపజేసింది.

● రూఫ్ లెవెల్ వరకు 167 నిర్మాణాలు..

మండలానికి ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పుంజుకున్నది. బేస్‌మెంట్ లెవెల్‌లో 561 ఇళ్లు పూర్తి కాగా, రూఫ్ లెవెల్‌లో 167 ఇళ్లు, స్లాబ్ లెవెల్‌లో 47 ఇళ్లు పూర్తయ్యాయి. అంతర్గాం మండలం మద్దిర్యాలకు 59 ఇళ్లు మంజూరు చేయగా, 17 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్, 8 ఇళ్లు రూఫ్ లెవెల్, 4 ఇళ్లు స్లాబ్ లెవెల్ వరకు పూర్తయ్యాయి. ధర్మారం మండలం బంజేరుపల్లికి 72 ఇళ్లు మంజూరు చేయగా, 20 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్, 4 ఇళ్లు రూఫ్ లెవెల్, ఒక ఇల్లు స్లాబ్ లెవెల్‌లో, ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి 108 ఇళ్లు మంజూరు చేయగా 40 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్, 11 ఇళ్లు రూఫ్‌లెవెల్, 4 ఇళ్లు స్లాబ్ లెవెల్ పూర్తయ్యాయి. జూలపల్లి మండలం కోనరావుపేటకు 144 ఇళ్లు మంజూరు చేయగా 27 బేస్‌మెంట్ లెవెల్, 6 రూఫ్ లెవెల్, 4 స్లాబ్ లెవెల్‌లో, మంథని మండలం అడవి సోమన్‌పల్లికి 228 ఇళ్లు మంజూరు చేయగా 172 బేస్‌మెంట్, 39 రూఫ్ లెవెల్, 5 స్లాబ్ లెవెల్‌లో పూర్తయ్యాయి. ముత్తారం మండలం మచ్చుపేటకు 40 ఇళ్లు మంజూరు చేయగా 14 బేస్‌మెంట్ లెవెల్, ఓదెల మండలం శానగొండకు 217 ఇళ్లు మంజూరు చేయగా, 46 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్, 7 రూఫ్ లెవెల్, 2 స్లాబ్ లెవెల్, పాలకుర్తి మండలం రామారావుపల్లికి 124 ఇళ్లు మంజూరు చేయగా 17 బేస్‌మెంట్ లెవెల్, 2 రూఫ్ లెవెల్, పెద్దపల్లి మండలం నిమ్మనపల్లికి 153 ఇళ్లు మంజూరు చేయగా 33 బేస్‌మెంట్ లెవెల్, 12 రూఫ్ లెవెల్, 4 స్లాబ్ లెవెల్‌లో, రామగిరి మండలం రత్నాపూర్‌కు 323 ఇళ్లు మంజూరు చేయగా 50 బేస్‌మెంట్ లెవెల్, 12 రూఫ్ లెవెల్, 2 ఇళ్లు స్లాబ్ లెవెల్, కాల్వశ్రీరాంపూర్ మండలం అంకంపల్లి గ్రామానికి 114 ఇళ్లు మంజూరు కాగా 10 బేస్‌మెంట్ లెవెల్, 5 రూఫ్ లెవెల్, 2 స్లాబ్ లెవెల్, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి 167 ఇళ్లు మంజూరు కాగా, 65 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్, 43 రూఫ్ లెవెల్, 14 స్లాబ్ లెవెల్ వరకు పూర్తయ్యాయని హౌసింగ్ పీడీ రాజేశ్వర్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

● ధరల నియంత్రణకు మండలానికి కమిటీ..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అందరు లబ్ధిదారులకు ఒకే ధరకు మెటీరియల్, లేబర్ చార్జీలు తీసుకునే విధంగా మండలానికి ఒక కమిటీని నియమించారు. కమిటీలో తహసీల్దార్, ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, లేబర్ ఆఫీసర్ ఉంటారు. ఇసుక, సిమెంట్, ఇటుకలు, లేబర్ చార్జీలు అందిరికీ ఒకే విధంగా తీసుకునే విధంగా పర్యవేక్షిస్తుంది. ఇసుకకు ఎలాంటి సీనరేజీ పన్నులు తీసుకోకుండా ఉచితంగా ఇస్తుండగా, లబ్ధిదారులు ట్రాక్టర్ చార్జీలను భరించాల్సి ఉంటుంది. ఇటీవల కలెక్టర్ ఇటుక బట్టీల యజమానులతో సమావేశం నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇటుక ఇవ్వాలని అందుకు ధర నిర్ణయించాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణాల్లో మరింత వేగం పెంచేందుకు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరనున్నది.

ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

కోల్‌సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో ప్రజల సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అధికారులకు సూచించారు. బుధవారం 46వ డివిజన్‌లో గడప గడపకు తిరిగి ప్రజలతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ప్రజల జీవన శైలి, మంచినీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాల స్థితిగతులను తెలుసుకున్నారు. సంబంధితశాఖ అధికారులకు ఫోన్లు చేసి తక్షణమే పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేస్తున్నట్టు చెప్పారు. నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, దూళికట్ట సతీష్, ముస్తాఫా ఉన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధి జంగాలపల్లిలోని డబుల్ బెడ్‌రూం సముదాయంలో 10 కోట్లతో నిర్మిస్తున్న తాగునీటి వ్యవస్థ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, విద్యుదీకరణకు పనులకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లను అసంపూర్తిగా ఒదిలేశారన్నారు. సీఎంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించానని తెలిపారు. డబుల్ బెడ్ రూంలలో అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామని, త్వరలోనే లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశం నిర్వహిస్తామన్నారు. అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ జె.అరుణశ్రీ మాట్లాడుతూ ము న్సిపల్ ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయిస్తామన్నారు. అధికారులు, మాజీ కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

హోంగార్డులకు రేయిన్ కోట్ల పంపిణీ

కోల్‌సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభం కావడంతో విధి నిర్వహణలో ఇబ్బందులు పడకుండా హోంగార్డులకు రేయిన్‌కోట్లు పంపిణీ చేశారు. బుధవారం కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా సిబ్బందికి అందజేశారు. రామగుండం సబ్ యూ నిట్‌లో విధులు నిర్వహించి అనారోగ్య సమస్యలతో మరణించిన హోంగార్డు మాతంగి రమేష్ కుటుంబ సభ్యులకు హోంగార్డు సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.15వేల చెక్కును సీపీ రమేష్ భార్య భార్గవికి అం దజేశారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ(హోంగార్డు) వామనమూర్తి, హోంగార్డులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కమాన్‌పూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షించాలని లయన్స్‌క్లబ్ ఎలైట్ మాజీ అధ్యక్షుడు కొంకటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మహిళా నాయకులు దీపం గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క రు ఇంటి పరిసరాలలో మొక్కలు నాటుకొని వాటిని కాపాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే కాలుష్యంతో పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నామని, వాటిని రూపుమాపాలంటే మొక్కలు పెంచాల్సిందేనని తెలిపారు. కార్యదర్శి అంబటి శంకర్, కారోబార్ బర్ల భూమ య్య, ఏఎన్ఎం పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కమాన్‌పూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కొట్టె సుధాకర్ తెలిపారు. బుధవారం బస్టాండ్ ఆవరణలో సైబర్ క్రైం మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మోసాలు జరగకుండా వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎవరికి షేర్ చేయవద్దని తెలిపారు. ఎవరైనా ఫోన్ చేసి సమాచారం అడిగితే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు రిపోర్టు చేయాలని, మోసాల బారిన పడి వారు పోలీస్ స్టేషన్, టోల్ ఫ్రీ నెంబర్‌లకు ఫిర్యాదు చేయాలని ఆయన పేర్కొన్నారు.

మంత్రి సహకారంతో లైబ్రరీ అభివృద్ధికి కృషి

మంథని, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సహకారంతో లైబ్రరీ అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. బుధవారం లైబ్రరీని స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో రూ. 10 లక్షలతో నూతన భవనం, బోర్‌వెల్, రేకుల షెడ్ నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించే విధంగా లైబ్రరీలో అన్ని పుస్తకాలు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి మెంబర్ శశిభూషణ్‌కాచే, పీఏసీఎస్ చైర్మన్‌కొత్త శ్రీనివాస్, జిల్లా ఆర్టీఏ మెంబర్ మంథని సురేష్, నేతలు ఐలి ప్రసాద్, బూడిద గణేష్, శంకర్, బెజ్జంకి డిగంబర్, అజీం, కుడుదుల వెంకన్న, ఆరెల్లి కిరణ్‌గౌడ్, సాదుల శ్రీకాంత్, వరుణ్‌గౌడ్, శంకర్‌లింగలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ముర్మూరు నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ పూర్ణ చందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి పంప్ హౌస్ ప్యానెల్ రూంలో గల మిషన్ భగీరథ ప్యానల్ బోర్డులో సాంకేతిక సమస్య తలెత్తడం వలన బుధవారం ఉదయం నుంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, మరమ్మతు పనులు జరుగుతున్నాయన్నారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్

కోల్‌సిటీటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని వాసవ్య పాఠశాల డైరెక్టర్ విక్రమ్ వర్మ అన్నారు. బుధవారం స్కూల్ కౌన్సిల్ ఎలక్షన్‌ను నిర్వహించారు. విద్యార్థులకు ఓటర్ల నమోదు, తుది జాబితా ప్రకటన, నామినేషన్లు, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డైరెక్టర్ విక్రమ్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించామన్నారు.

కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే జరిమానా

పాలకుర్తి, జూలై 2(ఆంధ్రజ్యోతి): రోడ్లపై ట్రాక్టర్లు కేజ్‌వీల్స్‌తో తిరిగితే జరిమానా తప్పదని ఎంపీడీవో కలికోట రామ్‌మోహనచారి తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో రోడ్లపై తిరిగితే మొదటిసారి రూ.5వేలు, రెండోసారి రూ.10 వేలు, మూడోసారి రూ.20వేల జరిమానాతోపాటు ట్రాక్టర్ సీజ్ చేస్తామన్నారు. తహసీల్దార్ జేరుపోతుల సునీత, మండల వ్యవసాయశాఖ అధికారి బండి ప్రమోద్ కుమార్, ఎస్ఐ స్వామి, రైతులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): తారురోడ్డుపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు నడిపిస్తే జరిమానా విధించనున్నట్లు తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు తెలిపారు. ట్రాక్టర్ల యజమానులతో కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి రోడ్లు వేయిస్తే ట్రాక్టర్లు నడిపేవారు కేజ్‌వీల్స్‌ను ఉపయోగించి ధ్వంసం చేయడం సరికాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి నడిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన గ్రామస్థులను కోరారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో కలికోట రామ్‌మోహన చారి

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): రోడ్ల పై కేజ్‌వీల్స్‌తో ఉన్న ట్రాక్టర్లను నడిపించడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బషీరొద్దిన్, ఎంపీడీఓ దివ్యదర్శన్‌రావు హెచ్చరిం చారు. మండల పరిషత్ కార్యాలయంలో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేజ్‌వీల్స్ నడపించడం వలన కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్లు ధ్వంసం అవుతున్నాయని అవగాహన కల్పించారు. ఎంపీఓ సమ్మిరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ మల్లీశ్వరి,ఏఎస్ఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



మాట్లాడుతున్న మెడికల్ సూపరింటెండెంట్ కె.పద్మ

గోదావరిఖని, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్‌జీ-1 ఏరియా జీడీకే 2, 2ఏ గనిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ కె.పద్మ ముఖ్య అతిథిగా హాజరై వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించవలసిన ఆహారపు అలవాట్ల గురించి కార్మికులకు వివరించారు. ప్రతీ ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు రాకుండా జాగ్రత్త పడాలని, కలుషిత ఆహారం, నీటిని తినటం తాగవద్దని తెలిపారు. గని మేనేజర్ అనిల్ గబాలే, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ గుర్రం ప్రభుదాస్, గని రక్షణాధికారి గంధం రాములు, సీఎంఓఏఐ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెరుమాళ్ళ శ్రీనివాస్, వేణుగోపాల్, దీటి చంద్రమౌళి పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

గోదావరిఖని, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఏరియా హాస్పిటల్‌లో సాయి ప్రియ అనే గర్భిణీ జూన్ 4న ప్రాణాపాయం నుంచి డాక్టర్ ఇందిరా, డాక్టర్ మద్దిలేటి డాక్టర్ వినోద్ కాపాడగా వారికి ప్రశంస పత్రాలను అందజేశారు. వైద్యులు అంబిక, విక్రమ్, మురళి, మల్లేష్, సాయి ప్రియ, ఇందిరా పాల్గొన్నారు.

సింగరేణిలో సమ్మెను జయప్రదం చేయాలి



సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

గోదావరిఖని, జూలై 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని బుధవారం జీడీకే 11ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో జేఏసీ సంఘాల నాయకులు కార్మికులను కోరారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని వారు విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. సింగరేణిలో కొత్త గనులు ఏర్పాటు చేయాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, కార్మికులకు సొంతింటి పథకం, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని, ప్రతి కార్మికుడికి రిటైర్డ్ అయిన తర్వాత కనీస పెన్షన్ 9వేలు చెల్లించాలని సమ్మె నోటీసును అందజేశామన్నారు. నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, తుమ్మల రాజిరెడ్డి, వడ్డెపెల్లి శంకర్, కే.విశ్వనాథ్, ఆరెల్లి పోషం, రంగు శ్రీను, నాయిని శంకర్, గొడిశెల నరేశ్ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జీడీకే 2ఏ గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రీజియన్ ప్రధాన కార్యదర్శి ఈదునూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన మీటింగ్‌లో ఐ కృష్ణ, జీ రాములు, పోగుల శేఖర్, రాజనర్సులు మాట్లాడారు. కార్మిక అనేక పోరాటాలతో, త్యాగాలతో కార్మిక చట్టాలను సాధించుకుంటే ప్రభుత్వం వాటిని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చే కుట్రలకు ఒడిగట్టిందన్నారు. నాయకులు ఈ నరేష్, ఐ రాజేశం, ఎం కొమరయ్య, ఎస్ ప్రసాద్, సంపత్, రాజయ్య పాల్గొన్నారు.

గోదావరిఖని, జూలై 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిర సిస్తూ సింగరేణిలో సమ్మె జయప్రదం చేయాలని భాస్కర్‌రావు భవన్‌లో సమ్మె వాల్ పోస్టర్స్‌ను జేఏసీ సంఘాల నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా విభజించడాన్ని వారు వ్యతిరేకించారు. సింగరేణిలో సమ్మెను జయప్రదం చేయాలని వారు కార్మికులను కోరారు. మడ్డి ఎల్లాగౌడ్, మిర్యాల రాజిరెడ్డి, మెండె శ్రీనివాస్, కే విశ్వనాథ్, సీపీఐనగర కార్యదర్శి కనకరాజు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రం కార్మిక హక్కులను కాలరాస్తోందని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఆరోపించారు. ఓసీపీ-1 సైటాఫీస్, బేస్ వర్క్ షాప్‌లలో జరిగిన గేట్‌మీటింగ్‌లో జేఏసీ నాయకులు మాట్లాడారు. ఈనెల 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో ఓసీపీ-1 కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైవీ రావు, గడ్డం తిరుపతి, సంపత్‌రెడ్డి, వెంకటస్వామి, రాంచందర్, నాగెల్లి సాంబయ్య, సయ్యద్ సలీం పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు నవీన్

కాల్వశ్రీరాంపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో మహేష్ అన్నారు. మడిపల్లి కాలనీ ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ప్రభుత్వ ఉపాధ్యాయుడు కడారి నవీన్ తన కుమారుడు కడారి సాయిచంద్‌ను పదో తరగతి కోసం ప్రైవేటు పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాడు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు నవీన్‌ను ఎంఈవో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన సాగుతోందన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎప్‌సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

కోల్‌సిటీటౌన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని శాతవాహన యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎప్‌సెట్-2025 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతున్నది. బుధవారం సుమారు 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాకాంత్, పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ నెల 6వ తేదీ నుంచి 11 వరకు వారికి కేటాయించిన లాగిన్ ద్వారా ఆప్షన్లు ఇవ్వాలని సూచించారు. అధికారులు డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రమేష్‌రెడ్డి, అజయ్‌కుమార్, యాదయ్య పాల్గొన్నారు.

మహిళల రక్షణకు షీ టీంలు

పెద్దపల్లి రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణ, భద్రత కోసం షీ టీంలు పనిచేస్తున్నట్లు టీం సభ్యురాలు స్నేహలత అన్నారు. బుధవారం అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ రోజు బస్టాండ్‌తోపాటు ప్రధాన చౌరస్తాలు, రద్దీ ప్రాంతాల్లో షీ టీం నిఘా ఉంచామన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థినులు 6303923700 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల హర్షం

ఎలిగేడు, జూలై 2, (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతిని ఈ నెల 4న అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ మేరకు మండల కేంద్రంలో పలువురు ఆర్యవైశ్యులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తాటపల్లి రమేష్ బాబు, తాటిపల్లి సతీష్ బాబు, కేశెట్టి రాఘవేంద్ర, కేశెట్టి నాగభూషణం, కేశెట్టి విద్యాసాగర్, రవి తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

గూడెంలో బీరన్న వేడుకలు

ఓదెల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెంలో బుధవారం కురుమ కులస్తుల ఆరాధ్య దైవం బీరన్న బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఇంటికో బోనంతో వెళ్లి నైవేద్యం సమర్పించారు. ఒగ్గు డోలు విన్యాసాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, ఏటా తొలకరి మొదలు తొలిఏకాదశికి, అనంతరం సంక్రాంతికి బీరన్నను దర్శించుకుంటామని తెలిపారు. మాజీ సర్పంచ్ ఎల్లస్వామి, కురుమ కుల పెద్దలు రాజకొమురయ్య, బీరయ్య, ఓదెలు, కుమారస్వామి పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ధర్మారం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లోని ఆర్టీసీ సిబ్బందితో సహా ప్రయాణికులకు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో 310 మందిని పరీక్షించారు. మెడికర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

రజక సంఘం ఆధ్వర్యంలో బోనాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న రజకులు

రామగిరి, జూలై 2(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో బుధవారం రజక ఆరాధ్యదైవంగా కొలిచే ఈశ్వరస్వామి బోనాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా రజక సంఘం అధ్యక్షుడు పెండ్యాల మహేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగెల్లి సాంబయ్యముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నాయకులు పున్నం సమ్మయ్య, ధర్మల రాజయ్య, రాయమల్లు, బండి రంజిత్, బండి మొండయ్య, రవి, ఉల్లంగుల రాజయ్య, ఓదెలు, కొత్తపల్లి రవీందర్ పాల్గొన్నారు.

పట్టాభిరామ్ మృతిపై సంతాపం

కోల్‌సిటీటౌన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, హిప్నాటిస్ట్ డాక్టర్ బీవీ పట్టాభిరామ్ మృతిపై గోదావరిఖనికి చెందిన ఇంద్రజాలికుడు మేజిక్ రాజా ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. పట్టాభిరామ్ మృతి ఇంద్రజాల, వ్యక్తిత్వ వికాస రంగాలకు తీరని లోటని పేర్కొన్నారు. పట్టాభిరామ్‌తో గోదావరిఖని ప్రాంతానికి, మేజిక్ కళాకారులతో విడదీయరాని అనుబంధం ఉందని, గతంలో దివ్యాంగులకు ఆర్థిక సహాయం కోసం నిర్వహించిన కార్యక్రమంతోపాటు ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారని గుర్తు చేశారు.

కొనసాగుతున్న పీరీల వేడుకలు

కమాన్‌పూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు కొనసాగుతున్నాయి. బుధవారం అంగడి బజార్ పీరీల వద్ద దాత నగునూరి సరిత సంతోష్, పద్మ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముజావర్ ఎస్‌కే రఫీక్, పలిగిరి సత్యం, ఫహీం, వెంకటేష్, నారగోని సరితగౌడ్, మచ్చ అనిల్, మధుకర్, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

పెద్దపల్లి రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం బ్రాహ్మణపల్లి రైతువేదికలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వానాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య పనులతోపాటు చెత్త చెదారం లేకుండా చూడాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్‌తో పాటు, నిల్వ నీటి ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాక్టర్ యజమానులకు కేజ్ వీల్స్‌తో రోడ్లపైకి రావొద్దని సూచించాలన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను వేగవంతం అయ్యేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. వన మహోత్సవం లక్ష్యాలను విజయవంతం చేయాలని, మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంపీవో ఫయాజ్ అలీ, ఏపీవో రమేష్‌బాబు, ఈజీఎస్ జేఈ రాజయ్య కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.